క్లుప్తంగా

23, 30న సామూహిక వ్రతాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాల త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 23, 30వ తేదీల్లో వచ్చే శుక్రవారాలల్లో సామూహిక వరలక్ష్మీ వత్రాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ భళ్ల నీలకంఠం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రత సామగ్రిని దాతలు అందజేస్తారని, మహిళలు కేజీన్నర బియ్యం, కలశ పాత్ర, జాకెట్టుముక్క మాత్రమే తీసుకు రావలసి ఉంటుందన్నారు. మొదటి అంతస్తుతో పాటు దిగువ భాగంలోను సామూహిక వ్రతాలకు ఏర్పాట్లు చేశామని, అలాగే పూజల్లో పాల్గొనే భక్తులకు అన్నదానం చేస్తున్నట్టు ఈఓ చెప్పారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

సామర్లకోట: మండల పరిధిలో ఉండూరు విద్యుత్ సమస్యను పరిష్కరించినట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఏఈఎస్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. బుధవారం సాక్షి దినపత్రికలో వాన లోను కోతలే అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఉండూరు గ్రామానికి మండల పరిధిలోని పవర ఫీడర్ నుంచి విద్యుత్తు సరఫరా అవుతోందని ఇది సామర్లకోట సబ్ స్టేషన్ నుంచి కేబుల్ రైల్వే క్రాసింగ్ లైను దిగువ భాగం నుంచి వెళుతుందన్నారు. అయితే జూలై 19న విద్యుత్ కేబుల్ పాడవడంతో 11 కేవీ డీఎస్‌ఏ ఫీడర్ నుంచి సరఫరా ఇచ్చినట్టు చెప్పారు. రైల్వే లైను దిగువ భాగంలో వర్షపు నీరు ఎక్కువగా ఉండటం వల్ల కేబుల్ మరమ్మతులకు అంతరాయం ఏర్పడిందని, ఈ కేబుల్ మరమ్మతులను 19న పూర్తి చేసి ఉండూరుకు విద్యుత్ సరఫరా చేసినట్టు తెలిపారు. అలాగే సామర్లకోట, పెద్దాపురం మండల పరిధిలో విద్యుత్తు కోతలు లేవన్నారు. అయితే సబ్ స్టేషన్‌లో మరమ్మతుల సమయంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



సామర్లకోటలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీ

సామర్లకోట: కోల్‌కతా పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగికదాడి, హత్యకు నిరసనగా బుధవారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విజ్ఞాన కార్యాలయం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ సాగింది. ఈ ఘటనలోని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాకినాడ ప్రభుత్వాస్పత్రి జూనియర్ డాక్టర్ పార్వతి మాట్లాడుతూ వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైద్యుల రక్షణ ప్రభుత్వ బాధ్యత, వైద్యులపై దాడులు నశించాలని వారంతా నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకులు కరణం ప్రసాదరావు, బాలం శ్రీనివాసు, బాలం హరి, కరణం శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం
రెండు గ్రామాల్లో 16 మందికి గాయాలు



కుక్క కాటుకు గురైన బాధితుడు

పిఠాపురం: పిఠాపురం మండలం భోగాపురం, పిఠాపురం శివారు ఏడుకాలువల గ్రామాల్లో పిచ్చి కుక్కలు దాడి చేయడంతో 16 మందికి గాయాలయ్యాయి. రెండు గ్రామాల్లోనూ రెండు కుక్కలు విచక్షణారహితంగా దాడి చేయడంతో పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో కొందరికి పిఠాపురం సీహెచ్‌సీలో వైద్య సేవలందించారు. తీవ్ర గాయాలైన వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. గొల్లప్రోలులో మంగళవారం ఓ పిచ్చి కుక్క దాడి చేయగా 10 మంది గాయపడిన సంఘటన మరువకముందే ఈ ఘటనలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలి



విరవలో రైతులకు శిక్షణ ఇస్తున్న ఏపీ అచ్యుతరావు



గోర్సలో తక్కువ పొలంలో పండించిన కూరగాయల సాగును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కొత్తపల్లి: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీ స్వాతి సూచించారు. మండలంలోని గోర్సలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. రైతులు పండించిన వివిధ రకాల కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంపై విలేజీ అగ్రికల్చర్ అసిస్టెంట్లు అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులందరూ ఒకేరోజు సామూహిక ఎలుకల నివారణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జోగిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి

పిఠాపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ.అచ్యుతరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. పిఠాపురం మండలం విరవలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సామూహిక ఎలుకల నివారణపై రైతులు, వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సామూహిక ఎలుకల నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. గతవారం తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని పొలంలో పిచికారీ చేయించారు. కార్యక్రమంలో గ్రామంలోని అభ్యుదయ రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పడుతూ లేస్తూ ప్రయాణాలు

- భూమి పూజ చేసి పదేళ్లయినా ముందుకు సాగని పనులు
- లింకు రోడ్లపై ప్రయాణికుల ఇక్కట్లు



గోతులతో దర్శనమిస్తున్న గోరింట-మల్లాం రహదారి

పెద్దాపురం: నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామంటూ ప్రగల్భాలు పలికిన ప్రస్తుత పాలకులు 2014వ సంవత్సరంలోనే భూమి పూజ చేసిన ఆ రహదారి నేటికీ కార్యరూపం దాల్చలేదు. పట్టణానికి వచ్చే లింకు రోడ్ల అభివృద్ధిపై నిధులు మంజూరయ్యాయని కూటమి నేతలు ప్రకటనలు చేసుకుంటున్నారు తప్ప కార్యరూపం కనుచూపు మేరలో కనపడడం లేదు.

రెండు సెగ్మెంట్లను కలిపే రహదారి

అలాగే ఏళ్ల తరబడి రెండు సెగ్మెంట్లను కలిపే ప్రధాన రహదారికి తూట్లు పడ్డాయి. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే రెండు నియోజకవర్గాల ప్రజలు నాన వస్థలు పడుతున్నారు. పెద్దాపురం, పిఠాపురం సెగ్మెంట్లను కలుపుతూ ఏర్పడ్డ ఈ రోడ్డుపై గోరింట, మల్లాం గ్రామాల ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. 2014లోనే దీనికి భూమిపూజ చేసి ఆనక పనులు నిలిపేశారు. గోరింట గ్రామానికి చెందిన హైస్కూల్ విద్యార్థులు పిఠాపురం మండలం మల్లాంలోనే విద్యనభ్యసిస్తారు. ఇక వర్షాకాలం కావడంతో ఈ రెండు గ్రామాల ప్రజల అవస్థలు వర్ణనాతీతం. గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు వాటిలో పడి ప్రమాదాల బారిన పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరించడం విమర్శలు వినిపిస్తున్నాయి.

లింకు రోడ్లపై దృష్టి సారించాలి..



పెద్దాపురం నుంచి గోరింట మీదుగా మల్లాం వెళ్లేందుకు ఉన్న రోడ్ల అభివృద్ధిలో అధికారులు విఫలమయ్యారు. లింకు, పుంత రోడ్లు నిర్మిస్తే ప్రయాణాలు సులభమవుతాయి. ప్రస్తుత పాలకులు, అధికారులు రహదారి నిర్మాణంపై దృష్టి పెట్టి ప్రజల కష్టాలను తీర్చాలి.

– గుణ్ణం లక్ష్మణరావు, ఫర్ ది పీపుల్ ఫౌండేషన్ చైర్మన్, పెద్దాపురం

త్వరగా నిర్మించాలి



ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలో లింక్ రోడ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలి. గోరింట నుంచి మల్లాం రహదారుల నిర్మాణాల విషయంపై రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలి.

– సన్నాయిల దుర్గా జ్యోతి, గృహిణి, మల్లాం, పిఠాపురం మండలం

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేసిన రైల్వే పోలీసు

సామర్లకోట: రైలు పట్టాలపై సెల్‌ఫోన్ జారవిడుచుకున్న బాధితుడికు తమ సిబ్బంది ఆ ఫోన్‌ను అందజేశారని ఎస్సై లోవరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీన మహారాష్ట్రకు చెందిన సాగర్ రాజు తక్, ప్రభు తాము ప్రయాణిస్తున్న 17479 రైలు నుంచి పిఠాపురం–సామర్లకోట మధ్యలో ఫోన్ జారవిడుచుకున్నారు. ఈ విషయాన్ని సామర్లకోట రైల్వే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో ఎస్సై డ్యూటీలో ఉన్న ట్రాక్ మెన్ వైవీఎస్ఎన్ నారాయణతో సామర్లకోట–పిఠాపురం మధ్యలో వెతికించగా సెల్‌ఫోన్ దొరకడంతో బాధితులకు అప్పగించినట్టు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

స్థానిక రైల్వే బుకింగ్ కౌంటర్ వద్ద అనారోగ్యంతో బాధపడుతున్న ఒక మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ నెల 18వ తేదీన ఆమెను 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బుధవారం సమాచారం వచ్చినట్టు రైల్వే ఎస్సై బి.లోవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మహిళ ఆకుపచ్చ ఆకుల డిజైన్ కలిగిన కాటన్ చీర, పచ్చ చిన్న తెలుపు పూల డిజైన్ కలిగిన జాకెట్టు, రెండు చేతులకు మట్టి గాజులు ఉన్నాయని తెలిపారు. మహిళ ఆచూకీ కోసం ఎస్సై బి.లోవరాజు సెల్ నెంబరు 93988 50428కు సంప్రదించాలన్నారు.

రహదారి చెంతనే గడ్డివాములు



పిఠాపురం- గోర్స రోడ్డులోని నాగంపేట వద్ద రోడ్డును ఆనుకుని వేసిన గడ్డివామి



ఆనంద్ నగర్ సమీపంలో రోడ్డు పక్కనే కట్టిన గేదెలు

కొత్తపల్లి: మండలంలోని గోర్స– పిఠాపురం రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కొమరగిరి శివారు ఆనందనగర్, నాగంపేట సమీపంలోని రోడ్డును ఆనుకుని గడ్డివాములు వేయడంతో పాటు పశువులను రోడ్డు పక్కనే కట్టివేస్తున్నారు. దీంతో పశువులు ఒక్కసారిగా రోడ్డుపై పరిగెత్తడం, వ్యర్థాలను రోడ్డుపైనే వేయడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో రోడ్డు మలుపులో ఉన్న గడ్డివాముల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి



ఆసుపత్రిలో రోగుల వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఏడీఎంహెచ్‌ఓ సరిత

పెద్దాపురం: ఆసుపత్రి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పి.సరిత ఆదేశించారు. ఫీవర్ సర్వేలో భాగంగా బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ ప్రస్తుత సీజనల్ వ్యాధుల నేపథ్యంలో రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. తదనుగుణంగా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలందించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆమె ఆరా తీశారు. ఆమె వెంట డాక్టర్ అనూషారాయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం ఫేస్‌బుక్ టీం సేవలు అభినందనీయం



మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీంను అభినందిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ

పెద్దాపురం: మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం సేవలు అభినందనీయమని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.సరిత అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద ఆ బృందం ప్రతి బుధవారం గర్భిణులకు అందించే ఆహారం పంపిణీని ఆమె పరిశీలించారు. నిండు గర్భిణుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సాయం చేస్తున్న ఫేస్‌బుక్ టీం సభ్యుల సేవలు అభినందనీయమన్నారు. అనంతరం గర్భిణులకు మాతృత్వం పౌష్టికాహారాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ అనూషారాయ్, హెడ్ నర్స్ రమాదేవి, ఫేస్‌బుక్ టీం సభ్యులు నరేష్ పెద్దిరెడ్డి, నవీన్ నాని, రాజేష్‌కుమార్, రాఘవ, జయశ్రీ, లక్ష్మి, రత్నం పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ

బోట్‌క్లబ్: బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన కుట్టుశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు వీఎస్ఎన్ మూర్తి, భారతి తెలిపారు. తూరంగిలోని ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రామకృష్ణ సత్యవేణి పాల్గొన్నారు.

ధర్నాలు, బైఠాయింపులతో బంద్

- ప్రశాంతంగా మాలమహానాడు నిరసన
- భారీగా నిరసన ప్రదర్శన
- ధర్నాలు, బైఠాయింపులు
- రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఉద్రిక్తత



పిఠాపురంలో బంద్ చేస్తున్న దళిత సంఘాల నాయకులు



సామర్లకోట పోలీసు రింగ్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించిన ఆందోళన కారులు

సామర్లకోట: మాల మహానాడు నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో భారత్ బంద్ ప్రశాంతంగా జరిగింది. కాకినాడ రోడ్డులో వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల్లో నాయకులు రోడ్లపై బైఠాయించారు. సామర్లకోటలో మాల మహానాడు జేఏసీ నాయకులు బుధవారం ఉదయం బ్రౌన్‌పేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసు రింగ్ సెంటర్‌లోను, బస్సు కాంప్లెక్స్ వద్ద, ఫ్లై ఓవర్‌పై ధర్నా చేశారు. సుప్రీమ్ కోర్టు తీర్పు రద్దు చేయాలని, మాల, మాదిగలను విడదీసే ప్రక్రియను మానుకోవాలని నినాదాలు చేశారు. స్థానిక బస్సు కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై బైఠాయించిన నాయకులు ఒకసారిగా రైల్వే స్టేషన్‌లోనికి వెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో కాస్త ఉద్రిక్తత ఏర్పడింది. వివిధ రైళ్లలో వచ్చిన ప్రయాణికులు బయటకు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. ఆంధ్ర మాలమహానాడు అధ్యక్షుడు లింగం శివప్రసాద్ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. మండల పరిధిలో గొంచాలతో పాటు వివిధ గ్రామాల్లో ఆందోళనలు నిర్వహించారు.

కాంప్లెక్స్‌లో నిలిచిన బస్సులు...

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులను ఆందోళనకారులు స్థానిక బస్సు కాంప్లెక్స్ లోనే నిలిపివేయడంతో ప్రయాణికులు బస్సులు దిగి వెళ్లిపోయారు. దీంతో ఆందోళనకారులు అక్కడ నుంచి వెళ్లిపోవడంతో పోలీసులు బందోబస్తు మధ్య ప్రయాణికులను బస్సులు ఎక్కించి పంపించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, బ్యాంకులు, పోస్టాఫీసు, వ్యాపార సంస్థలను మూసి వేశారు. డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో ఎస్సై అడపా గరగారావు, పీవీఆర్ మూర్తి, గండేపల్లి, రంగంపేట సీఐలు, ఎస్సైలు సుమారు 100 మంది పోలీసులతో బందోబస్తు చేశారు. స్టేషన్ ఆవరణలో ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జేఏసీ నాయకులు నేతల హరిబాబు, బుంగా సతీష్, సలాది వెంకటేశ్వరరావు, కాకర ప్రసాద్, కుంచే జగ్గారావు, అరుణ్‌కుమార్, అచ్చారావు, లింగం శివకుమార్, పిట్టా సత్యనారాయణ, పిట్టా జానకి రామారావు ఆందోళనలకు నాయకత్వం వహించారు.

పెద్దాపురంలో విజయవంతం

పెద్దాపురం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పునకు నిరసనగా మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంద్ పెద్దాపురంలో విజయవంతం అయ్యింది. ప్రభుత్వ విద్యా సంస్థలు, కార్యాలయాలు, ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్‌కు సహకరించాయి. పట్టణంలో ర్యాలీ నిర్వహించి వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూయించారు. ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. తొలుత స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బేదంపూడి సత్తిబాబు, గుర్రాల యాకోబు, ఆరెళ్లి వీర్రాఘవులు, జాలా దావీదు తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్ ప్రశాంతం

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భారత్‌బంద్ పిఠాపురం నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. వివిధ గ్రామాలకు చెందిన మాలమహానాడు, దళిత సంఘాలు నాయకులు, కార్యకర్తలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు. పిఠాపురంలో పాఠశాలలు, కాలేజీలు, దుకాణాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలను ఆందోళనకారులు మూసివేయించారు. మాల మహానాడు అధ్యక్షుడు గుబ్బల రాజు, బీఎస్పీ పిఠాపురం ఇన్‌చార్జ్ ఖండవల్లి లోవరాజు, పీవీ రావు మాలమహానాడు టౌన్ అధ్యక్షులు వేలంగి వెంకటేష్, ఉపాధ్యక్షులు మైనాబత్తుల అప్పలరాజు, ఏవైఎం అసోసియేషన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో అంబేడ్కర్ వారసుల గ్రూప్ యూత్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. పలు గ్రామాల్లో ఆందోళనకారులు ర్యాలీలు చేశారు. కార్యక్రమంలో దొమ్మేటి మనోహర్, దాసరి రఘు, బచ్చలసౌరి, ఇరువుల రమేష్, దొమ్మేటి లోవకుమార్ పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన భారత్ బంద్ మండలంలో విజయవంతమైంది. ఆందోళనకారులు గ్రామాల్లో ర్యాలీలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులను, దుకాణాలను మూసి వేయించారు. ఎస్సీ వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు అంటూ నినాదాలు చేశారు. వాకతిప్ప అంబేడ్కర్ సెంటర్ వద్ద మాలమహానాడు మండల కార్యదర్శి బత్తుల రాంజీకుమార్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. తీరప్రాంతంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సలాది బాబులు ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి శేఖర్, దాకే రాజ్‌కుమార్, చీకట్ల శివ, దడాల ప్రసాద్, గెద్దం దుర్గా ప్రసాద్, బత్తిన రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకో రుచి.. తినరా మైమరచి..

- నగరంలో సందడి చేస్తున్న పలావ్ సెంటర్లు
- విభిన్న రుచులతో ఆకట్టుకుంటున్న వ్యాపారులు
- కాకినాడ వాసుల అభిమానాన్ని చూరగొంటున్న వైనం
- రూ.లక్షల్లో సాగుతున్న లావాదేవీలు



కాకినాడ 5 బిల్డింగ్స్ సెంటర్‌లో చిట్టిబాబు కోడిపలావ్



నాగమల్లితోట జంక్షన్‌లో సూరిబాబు కోడి పలావ్



ఆశ్రం స్కూల్ సమీపంలో కొత్తగా సిద్ధమవుతున్న నాయుడు గారి పలావ్

కాకినాడ క్రైం: చిట్టిబాబు, సత్తిబాబు, సూరిబాబు, నాయుడుగారు, రెడ్డిగారు, రాజుగారు.. ఈ పేర్లన్నీ ఈ మధ్య కాలంలో కాకినాడ వాసుల చెవుల్లో మార్మోగుతుంటే.. ఆ పేర్లు పలుకుతున్న నోళ్లలో నీళ్లూరుతున్నాయి. నగరంలో ఏ ఇద్దరు కలిసినా ఈ పేర్లపైనే చర్చ. వీళ్లంతా ఎవరనుకుంటున్నారా.. ఇవన్నీ నగరంలో కొత్తగా వెలిసిన పలావ్ సెంటర్ల పేర్లండీ.. అవును.. నాటు కోడితో పాటు పేర్లు జతకట్టాయి. అచ్చమైన తెలుగింటి పేర్లతో ఒకరితో మరొకరికి పోలిక లేని సొంత తయారీ రుచులతో ఎవరికి వారు బిర్యానీ సెంటర్లు పెట్టి రాణిస్తున్నారు. సాంప్రదాయానికి ఆధునికతను జోడించి నగర వాసులకు కొత్త రుచులు పరిచయం చేస్తూ బిర్యానీ విక్రయాల్లో సరికొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. వీరి వ్యాపారాభిలాషకి బిర్యానీ ప్రియుల ఆసక్తి తోడవడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

ఈ మధ్య కాలంలో...

గడచిన ఆరు నెలల్లో చిట్టిబాబు కోడి పలావ్, సత్తిబాబు కోడి పలావ్, సూరిబాబు కోడి పలావ్ వంటి స్థానికత ఉట్టిపడే పేర్లతో బిర్యానీ సెంటర్లు వెలిశాయి. ఇంతకు కొన్నాళ్ల ముందు నాయుడుగారి బిర్యానీ, రెడ్డిగారి బిర్యానీ, రాజుగారి బిర్యానీ అంటూ ఇంకొన్ని హల్‌చల్ చేశాయి. ఇవన్నీ తమకి మాత్రమే ప్రత్యేకతగా మరెక్కడా లభ్యం కాని సొంత రుచుల్లో ఆహార ప్రియులను అలరించాయి. పేర్లలో భిన్నత్వం ఉట్టిపడడంతో ప్రజల్లోనూ మంచి ఆదరణ దక్కుతోంది. తెలిసిన వాళ్లో, పొరుగింటి పేర్లో అన్న భావన వినియోగదారులను ఆకట్టుకుంటోంది.

మెయింటెనెన్స్ అదుర్స్..

పెట్టింది లోకల్ పేర్లే అయినా, పలావ్ పాయింట్ల నిర్వహణ మాత్రం పెద్ద నగరాల్లో రెస్టారెంట్లను తలదన్నే రీతిలో ఉంది. అధునాతన నిర్మాణాలతో వీటిని అదరగొడుతున్నారు. ఇంటీరియర్‌ను చూస్తే నోరెళ్లబెట్టాల్సిందే. పార్సిల్ తీసుకునే కాసేపు కొన్ని దుకాణాల్లో ఏసీలో చల్లబడొచ్చు. చేప, రొయ్య, చికెన్ వెరైటీలతో ప్రదర్శిస్తున్న డిస్ప్లే ఆకట్టుకుంటున్నాయి.

నోరూరించే రుచులెన్నో..

ఆయా పలావ్ సెంటర్లలో మెనూ చూస్తే నాటు కోడి సహా పీతలు, రొయ్యలు, మటన్‌లతో లెక్కలేనన్ని, అంతకు ముందు తినని వెరైటీలెన్నో అందులో కనిపిస్తాయి. సాధారణ బిర్యానీలకు భిన్నంగా పలావ్‌లు, బగర్ రైస్, బీజింగ్ ప్రాన్, స్టఫ్డ్‌క్రాబ్, తందూరీ, కౌజు పిట్ట, దూపుడు గొర్రె వీరి మెనూని కిర్రెక్కిస్తున్నాయి. మాంసాహారులకు కాక పుట్టిస్తున్నాయి.

పొరుగు రాష్ట్రాల ఫ్లేవర్లు..

ముఖ్యంగా హైదరాబాద్, చెన్నైల నుంచి వివిధ తయారీ విధానాలను ఈ సెంటర్ల యజమానులు దిగుమతి చేసుకోవడమే కాక వాటికి స్థానికతను జోడిస్తున్నారు. తరచుగా తినే వంటకాలే అయినా తయారీలో ప్రత్యేకతతోనే రుచులు కిక్కెకిస్తున్నాయి. ఎవరికీ చెప్పని రహస్య మసాలా ఫ్లేవర్లు సొంతగా తయారు చేసి బిర్యానీకి అదనపు రుచిని అద్దుతుండడంలో నిర్వాహకుల నైపుణ్యం ఎంతో ఉంది.

వేలల్లో విక్రయాలు.. లక్షల్లో సంపాదన..

కొత్తగా పురుడు పోసుకున్న పలావ్ సెంటర్లు రోజుకి కనిష్టంగా 1500 నుంచి గరిష్టంగా 2000 బిర్యానీ ప్యాక్‌లను విక్రయిస్తున్నాయి. ఇవి కాకుండా ఇతర ఐటమ్స్ అదనం. వీరి నెల సంపాదన కనీసం రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల మధ్యలో ఉంటుంది.

ఆన్‌లైన్‌లో హల్‌చల్..

తాజాగా కాకినాడ వాసులను అంతులేని రుచులతో అలరిస్తున్న ఈ బిర్యానీ సెంటర్లు అన్నీ ఆన్‌లైన్‌లో షార్ట్స్, రీల్స్ రూపంలో హల్‌చల్ చేస్తున్నాయి. ప్రజల ఆదరణ, రద్దీ చూసి ఫుడ్ బ్లాగర్లు, యూట్యూబర్లు క్యూ కడుతున్నారు. వీటిని తమ ఛానల్స్‌లో పెడుతూ అభిమానుల ఆదరణలు చూరగొంటున్నారు.

పేరుతో ఆకర్షణ రుచితో ఆదరణ



కొత్తగా ఏర్పడిన ఈ ట్రెండ్ ప్రజలను ఆకర్షిస్తోంది. పేరుతో ఆకర్షణ, రుచితో ఆదరణ చేకూరుతాయి. విభిన్నమైన పేర్లతోనే వ్యాపారాలు వృద్ధి చెందవు. పేరుకు తగ్గ నాణ్యత, రుచి ఇవ్వాలి. పులావ్, బిర్యానీలలో సరికొత్త రుచులు పరిచయం చేసేందుకు నిత్యం ప్రయోగాలు, పరిశీలనలు చేస్తూ ఉంటాం. ప్రజలకు సరికొత్త రుచులు పరిచయం చేసేందుకు హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల బిర్యాలనీలపై అధ్యయనం చేస్తున్నాం. వాటికి ఆంధ్రా రుచిని జత చేస్తున్నాం. సరికొత్త రుచులను కాకినాడ వాసులు ఎల్లప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. దీంతో మాలాంటి వ్యాపారవేత్తలకు మంచి ప్రోత్సాహం లభిస్తోంది.

– దుళ్ల సునీల్, చిట్టిబాబు కోడిపలావ్, అధినేత

వెరైటీ పేర్లు.. అదిరే రుచులు



నాగమల్లితోటలో ఉన్న చిట్టిబాబు, సూరిబాబు కోడి పులావ్ పేరు వెరైటీగా ఉండి ట్రై చేశాం. మంచి రుచితో పులావ్ అదరగొట్టారు. చికెన్ సహా నాన్‌వెజ్ వెరైటీలు అన్నీ తక్కువ ధరలకే లభిస్తున్నాయి. వారంలో కనీసం రెండు సార్లు పులావ్ పార్శిళ్లు ఇంటికి తీసుకు వెళ్తా ఉంటాను. చిన్నపిల్లలతో సహా ఇంటిల్లిపాదీ ఇష్టంగా తింటూ ఆస్వాదిస్తున్నారు. ఓ బిజినెస్ మ్యాన్‌గా కొత్త వ్యాపారాలు విజయవంత మవ్వాలని కోరుకుంటాను. వీటిని ఏర్పాటు చేసిన వారంతా యువ వ్యాపార వేత్తలే కావడం అభినందనీయం.

– యజ్జల బాబ్జీ, కాకినాడ